

నేటి నుంచి కళాక్షేత్రంలో చేనేత వస్త్ర ప్రదర్శన

కడప : కడప నగరంలోని నామ్ ఖాన్ కళాక్షేత్రంలో ఈనెల 9 నుంచి 15 వరకు వారం రోజులపాటు 'జిల్లా చేనేత వస్త్ర ప్రదర్శన' నిర్వహిస్తున్నట్లు జిల్లా చేనేత, జోలి శాఖ అధికారి వి. భీమయ్య తెలిపారు. గురువారం ఉదయం 10:30 గంటలకు కలెక్టర్ విజయ్ రామరాజు చేతుల మీదుగా జిల్లా చేనేత వస్త్ర ప్రదర్శన ప్రారంభమవుతుందని చెప్పారు. జిల్లా చేనేత వస్త్ర ప్రదర్శనలో రాష్ట్రంలోని ప్రఖ్యాతిగాంచిన వివిధ జిల్లాల కాటన్, పట్టు వస్త్రాలతో పాటు మెర్సిడైజ్డ్, పట్టు టై అండ్ డై చీరలు, సికో చీరలు, ధర్మవరం, గద్వాల్, ఉప్పాడ, పోచంపల్లి పట్టు చీరలు, మాధవరం, వెంకటగిరి కాటన్ చీరలు, మంగళగిరి డ్రెస్ మెటీరియల్, బందర్ జరీ చీరలు, జమదాని చీరలు, షర్టింగ్, కలంకారి వస్త్రాలు, పొందూరి ఖద్దరు, సిల్క్ షర్టింగ్స్, ప్రఖ్యాతి గాంచిన ఎమ్మిగనూరు బెడ్ షీట్స్, లుంగీలు, డ్రెస్ మెటీరియల్స్, పేరు ఎన్నిక గల ఆకర్షణీయమైన వస్త్ర ఉత్పత్తులు సందర్శకులకు అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. ఈ ప్రదర్శనకు రాష్ట్రం నలుమూలల నుంచి దాదాపు 30 చేనేత సహకార సంఘాల ఉత్పత్తిదారులు పాల్గొననున్నట్లు తెలిపారు.

పనిచేయని 2డి ఎకో!

10 రోజులుగా హృద్రోగ పరీక్షలకు బ్రేక్

ఆందోళనలో హార్ట్ పేషంట్లు

పట్టని జిజిహెచ్ అధికారులు

ప్రజాశక్తి - కడప ప్రతినిధి



జిల్లా సర్వజన ఆస్పత్రిలోని 2డి ఎకో పరికరం పనిచేయడం లేదు. 10 రోజులుగా జిజిహెచ్ ఆస్పత్రిలో హార్ట్ పేషంట్ల పరీక్షలు నిలిచి పోయాయి. జిజిహెచ్ రేడియాలజీ డిపార్టు మెంట్‌లో 2డి ఎకో పరికరంతోపాటు హృద్రోగులను పరీక్షించే ప్రోబ్ పరికరం అందు బాటులో ఉన్నప్పటికీ ఏర్పాటు చేయడంలో జిజిహెచ్ యంత్రాంగం నిర్లక్ష్యం చేయడం విస్మయాన్ని కలిగిస్తోంది. జిజిహెచ్‌కు వచ్చే హార్ట్ పేషంట్లు తమ ప్రాణాలను అరచేతిలో పెట్టుకుని కాలం వెళ్ల దీయాల్సిన దుస్థితి దాపురించింది. సాధారనంగా ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిలో రోజుకు సుమారు 10 నుంచి 12 మంది హార్ట్‌పేషంట్లు 2డి ఎకో పరికరంతో పరీక్షలు చేయించుకుంటున్నట్లు జిజిహెచ్ ఉన్నతాధికారులు చెబుతుండడం గమనార్హం. ఎకో పరికరం ఆధారంతో దినదిన గండం నూరేళ్ల ఆయుష్షు అన్న చందంగా కాలం వెళ్ల దీస్తున్న హృద్రోగుల్లో భయాందోళన నెలకొంది. కడప నగరంలోని ప్రయివేటు ఆస్పత్రులకు హృద్రోగులు పరుగులు తీస్తుండడం ఆందోళన కలిగిస్తోంది. ఒక్కొక్కరు సుమారు రూ.1500 నుంచి రూ.2000 వరకు వెచ్చించాల్సి వస్తున్నట్లు తెలుస్తోంది. ఇంతటి పెద్దమొత్తంలో డబ్బులు చెల్లించి 2డి ఎకో పరీక్ష చేయించుకునే స్తోమత లేని పలువురు హార్ట్‌పేషంట్లు జిజిహెచ్ వైపే ఆశగా ఎదురు చూస్తుండడం గమనార్హం. ఇటువంటి అభాగ్యుల పట్ల ఎంతో ప్రేమా దరణలతో వ్యవహరించాల్సిన జిజిహెచ్ అధికార యంత్రాంగం నిద్రావస్థలో జోగుతుండడంపై పెద్దఎత్తున విమర్శలు వెల్లువెత్తున్నాయి. ఇప్పటికైనా జిల్లా అధికార యంత్రాంగం తక్షణమే స్పందించి ఎంఐసియులోని ఎకో పరికరానికి మరమ్మతులను పూర్తి చేసే వరకై నా రేడియాలజీ డిపార్టుమెంట్‌లో ఉన్నటువంటి 2డి ఎకో, ప్రోబ్ పరికరాలను ఏర్పాటు చేసి రోగులను ఆందోళనలకు తెరదించాల్సిన అవసరం అవసరం ఎంతైనా ఉందనడంలో సందేహం లేదు.

మరమ్మతునకు ప్రయత్నం

జిజిహెచ్‌లో నెల రోజుల కింద ఎకో పరికరం మరమ్మతులకు గురైంది. మరమ్మతు చేయడానికి సుమారు రూ.4 లక్షల వరకు ఖర్చు అయ్యే అవకాశం ఉంది. ఉన్నతాధికారులతో మాట్లాడిన అనంతరం టెక్నీషియన్‌ను పిలిపించి మరమ్మతు చేయిస్తాం. అంత వరకు హార్ట్ పేషంట్లకు ప్రయివేటు ఆస్పత్రుల్లో ఆరోగ్యశ్రీ కింద పరీక్షలు చేయించే ఏర్పాట్లు చేస్తాం.

- కె.వి.వి వెంకటేశ్వరరావు, జిజిహెచ్ సూపరింటెండెంట్, కడప.

మైనార్టీల సంక్షేమానికి పెద్దపీట

జాతీయ మైనార్టీ కమిషన్ సభ్యులు సయ్యద్ షెహజాది సాహెబా



సమావేశంలో మాట్లాడుతున్న సయ్యద్ షెహజాది సాహెబా

ప్రజాశక్తి - కడప/ కడప అర్బన్

మైనార్టీల సంక్షేమానికి ప్రభుత్వాలు పెద్దపీట వేస్తున్నాయని, వారి సంక్షేమం కోసం మైనారిటీ జాతీయ కమిషన్ నిరంతరం పాటుపడుతోందని, మైనార్టీ జాతీయ సభ్యులు సయ్యద్ షెహజాది సాహెబా పేర్కొన్నారు. బుధవారం కలెక్టరేట్‌లోని వీసి హాలులో 'ప్రధాన మంత్రి 15 సూత్రాల అమలు' అనే అంశంపై సంబంధిత శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా కలెక్టర్ వి.విజయ్ రామరాజు తోపాటు, ఎస్పి అన్బు రాజన్, జెసి సాయికాంత్ వర్మ, హజ్ కమిటీ చైర్మన్ గౌస్ లాజమ్, వేర్ హౌస్ కార్పొరేషన్ చైర్మన్ కరీముల్లా, రాష్ట్ర మైనారిటీ కమీషన్ సభ్యులు హిదాయతుల్లా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాజ్యాంగబద్ధంగా ఏర్పాటైన జాతీయ మైనార్టీ కమిషన్ మైనార్టీల సంక్షేమానికి కేంద్ర, రాష్ట్ర శాసనసభలు చేసిన చట్టాల అమలు తీరును, సమస్యలను పర్యవేక్షిస్తున్నామని చెప్పారు. కమిషన్‌కు సివిల్ కోర్టు అధికారాలున్నాయని, మైనార్టీలు ఎదుర్కొంటున్న సమస్యలు, హక్కులను విస్మయించే వారిపై కమిషన్ చట్ట పరంగా చర్యలు తీసుకుంటోందన్నారు. ఆంధ్ర రాష్ట్రంలో అమలవుతున్న సంక్షేమ పథకాల్లో మైనారిటీ వర్గాలకు చెందిన పేదలు ఆర్థికంగా బలపడుతున్నారని ఆమె సంతృప్తి వ్యక్తం చేశారు. అన్ని రాష్ట్రాల్లోను మైనారిటీ ఉద్యోగులు, మహిళలు, కార్మికుల సంక్షేమం కోసం కేంద్ర ప్రభుత్వం జాతీయ స్థాయిలో ప్రత్యేక కమిషన్ ను ఏర్పాటు చేసి వారి సమస్యలను ఎప్పటికప్పుడూ పరిష్కరిస్తోందన్నారు. అనంతరం ప్రధానమంత్రి 15 కార్యక్రమాల అమలుపై ఆమె సమీక్షించారు. అంతకుముందు కలెక్టర్ మైనారిటీ వర్గాల ప్రజల సంక్షేమం కోసం కేంద్ర ప్రభుత్వం అమలు చేసున్న అన్ని పథకాలను. ల్లాలో పూర్తిస్థాయిలో అమలు చేస్తున్నామని చెప్పారు. జిల్లాలో హజ్‌భవన్, పెద్దదర్గా అభివృద్ధికి కృషి చేయను న్నామని చెప్పారు. కార్యక్రమంలో డిఆర్ఒ గంగాధర గౌడ్, జిల్లా మైనారిటీ సంక్షేమ శాఖ అధికారి కృష్ణ కిషోర్, బిసి కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డా.వి.బ్రహ్మయ్య, డ్వామా పీడీ యధుభూషన్ రెడ్డి, ఐసిడిఎస్ పీడీ ఎం.ఎన్. రాణి, డిఎంహెచ్ఒ డాక్టర్ నాగరాజు, డిఇఒ సి.దేవరాజు, ఎస్ఎస్ఎ పిఒ ప్రభాకర్‌రెడ్డి సంబందిత శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

మైనార్టీల సమస్యలపై ప్రత్యేక దృష్టి

మైనార్టీలు ఎదుర్కొంటున్న సమస్యలు, హక్కులకు సంబంధించి కమిషన్ దృష్టికి తీసుకొస్తే పరిష్కరిస్తామని కమిషన్ సభ్యురాలు పేర్కొన్నారు. స్థానిక ఆర్ అండ్ బి గెస్ట్ హౌస్‌లో వివిధ మైనార్టీ వర్గాల సంఘాల నేతలు, మైనార్టీ వర్గాల మత పెద్దలు, వివిధ నాయకులతో వారు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాజ్యాంగబద్ధంగా ఏర్పాటైన జాతీయ మైనార్టీ కమిషన్ మెనార్టీల సంక్షేమానికి కేంద్ర, రాష్ట్ర శాసనసభలు చేసిన చట్టాల అమలు తీరును, సమస్యలను పర్యవేక్షిస్తామని చెప్పారు. సమావేశంలో రాష్ట్ర మైనారిటీ కమిషన్ సభ్యులు ఇదయతుల్లా, ఆర్టీవో ధర్మ చంద్రా రెడ్డి, జిల్లా మైనార్టీ సంక్షేమ శాఖ ఇన్‌ఛార్జి అధికారి కృష్ణ కిషోర్, నగర కార్పొరేటర్ షఫీ, వివిధ మైనార్టీ సంఘాల నేతలు, మైనార్టీ మత పెద్దలు, పాల్గొన్నారు.

అమీన్‌పీర్ దర్గాను సందర్శించిన కమిషన్ సభ్యురాలు

ప్రముఖ ప్రసిద్ధి గాంచిన కడప అమీన్‌పీర్ దర్గాను జాతీయ అల్ప సంఖ్యాక మైనార్టీ కమిషన్ సభ్యులు సయ్యద్ షాహజాదీ బుధవారం సందర్శించారు. దర్గాకు విచ్చేసిన ఆమెకు ముజవర్లు సాంప్రదాయ ప్రకారం స్వాగతం పలికారు. ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి, దర్గా విశిష్ఠతను అడిగి తెలుసుకున్నారు.

వినతుల వెల్లువ..


వినతి పత్రం అందజేస్తున్న సలావుద్దీన్

వివిధ సంఘాల మైనార్టీ నేతల వినతులను జాతీయ అల్ప సంఖ్యాక మైనార్టీ కమిషన్ సభ్యులు సయ్యద్ షాహజాదీ స్వీకరించారు. **రాష్ట్రంలో ఉన్న క్రిస్టియన్ మైనార్టీ సమస్యల పరిష్కారం కోసం** తమ వంతు సహకరించాలని ఆంధ్రప్రదేశ్ పాస్టర్స్ ఫెడరేషన్ జిల్లా అధ్యక్షులు మల్లెం. విజయభాస్కర్ జాతీయ కమిషన్ సభ్యురాలను మర్యాదపూర్వకంగా కలిసి వినతిపత్రం అందజేశారు. **మైనార్టీల నిధులు మంజూరు చేయండి** కేంద్ర ప్రభుత్వం ద్వారా మైనార్టీలకు నిధులు మంజూరయ్యేలా కృషి చేయాలని జాతీయ మైనారిటీ కమిషన్ సభ్యురాలు సయ్యద్ షెహజాది ని సంఘ సేవకులు సయ్యద్ సలావుద్దీన్ కోరారు. బుధవారం ఆర్అండ్‌బి అతిథి గృహంలో వినతిపత్రం అందజేశారు. **అక్రమ కేసులు ఎత్తివేయాలి** మైనారిటీ ముస్లిమ్స్ పై దాడులు చేసి వారి పైనే కేసులు బనాయిస్తున్నారని, బాధితుని మీద నమోదు చేసిన కేసులు ఎత్తి వేయాలని జాతీయ మైనారిటీ కమిషన్ సభ్యురాలు సయ్యిద్ షెహజాదికు కడప కలెక్టర్ కార్యాలయంలో టిడిపి జిల్లా అధికార ప్రతినిధి మన్సూర్ అక్బర్ వినతి పత్రం అందజేశారు. కడప హజ్ భవనాన్ని న్యాయపరంగా వినియోగంలోకి తీసుకురావాలని కోరారు. **హజ్ హౌస్‌ను పునరుద్ధరించండి**

కడప హజ్‌హౌస్‌ను పునరుద్ధరించాలని టిడిపి నగర అధ్యక్షులు సానపు రెడ్డి శివ కొండా రెడ్డి, ప్రధాన కార్యదర్శి జలతోటి జయకుమార్, మైనార్టీ సెల్ నగర అధ్యక్షులు షేక్ ఇమ్రాన్ నగరంలోని రోడ్డు భవనాల అతిథి గృహంలో జాతీయ మైనారిటీ కమిషన్ సభ్యులు సయ్యద్ షాహజాదిని కలిసి శాలువా, బొకేతో సన్మానించి వినతి పత్రం అందజేశారు.

కోదండరాముని బ్రహ్మోత్సవాలకు ఏర్పాట్లు

- ఏప్రిల్ 5న స్వామివారి కల్యాణోత్సవం
- ముఖ్యమంత్రిచే పట్టు వస్త్రాల సమర్పణ
- సమీక్షా సమావేశంలో టిటిడి జెఇఒ వీరబ్రహ్మం

ప్రజాశక్తి-ఒంటిమిట్ట


కల్యాణ మండపం వద్ద ఏర్పాట్లపై అధికారులకు సూచనలిస్తున్న జెఇఒ

ఒంటిమిట్ట శ్రీ కోదండరామ స్వామి బ్రహ్మోత్సవాలు మార్చి 30వ తేదీ నుంచి అంగరంగ వైభవంగా నిర్వహించడానికి అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని టిటిడి జెఇఒ వీరబ్రహ్మం చెప్పారు. బ్రహ్మోత్సవాల ఏర్పాట్లపై బుధవారం ఆయన అధికారులతో కలసి క్షేత్రస్థాయిపరిశీలన, సమీక్ష జరిపారు. అనంతరం వీరబ్రహ్మం మాట్లాడుతూ మార్చి 30వ తేదీ సాయంత్రం అంకురార్పణతో శ్రీకోదండరామస్వామి బ్రహ్మోత్సవాలు ప్రారంభం అవుతాయని తెలిపారు. ఏప్రిల్ 5వ తేదీ శ్రీ కోదండరాముడి కల్యాణం అంగరంగ వైభవంగా నిర్వహిస్తామన్నారు. ప్రభుత్వం తరపున ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్‌రెడ్డి పట్టు వస్త్రాలు సమర్పిస్తారని తెలిపారు. ఈ సందర్భంగా చేయాల్సిన ఏర్పాట్లపై అధికారులతో ఇప్పటికే సమీక్ష జరిపి అనేక సూచనలు చేశామన్నారు. బ్రహ్మోత్సవాలకు, స్వామివారి కల్యాణానికి హాజరయ్యే భక్తులకు ఏ అసౌకర్యం కలగకుండా, అవసరమైన అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని పేర్కొన్నారు. నెలరోజుల ముందు నుంచే టిటిడి ఈ పనులను ప్రారంభించిందన్నారు. కల్యాణోత్సవం సందర్భంగా ఏర్పాటు చేయాల్సిన గ్యాలరీలు, వాటిలోకి భక్తులను అనుమతించాల్సిన విధానం, భక్తులకు తాగునీరు, అన్నప్రసాదాల పంపిణీ ఏర్పాట్లపై సమీక్ష జరిపామన్నారు. గ్యాలరీల్లో భక్తులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా ఈసారి మరింత మెరుగైన ఏర్పాట్లు చేస్తున్నామని చెప్పారు. కల్యాణ వేదిక అలంకరణ, సాంస్కృతిక కార్యక్రమాలు కూడా భక్తులను ఆకట్టుకునేలా నిర్వహిస్తామన్నారు. కల్యాణానికి హాజరయ్యే భక్తులందరికీ ముత్యాల తలంబ్రాలు అందేలా ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. టిటిడి ఇఒ ఎవి ధర్మారెడ్డి రెండు వారాల్లో జిల్లా అధికారులతో సమన్వయ సమావేశం నిర్వహిస్తారని తెలిపారు. సమావేశంలో టిటిడి చీఫ్ ఇంజనీర్ నాగేశ్వరరావు విద్యుత్ విభాగం ఎస్ఇ వెంకటేశ్వర్లు, ఆలయ డిప్యూటీ ఇఒ నటేష్ బాబు, డిప్యూటీ ఇఒలు గుణభూషణ్‌రెడ్డి, సుబ్రహ్మణ్యం, ఇఇ సుమతి, అదనపు ఆరోగ్యాధికారి డాక్టర్ సునీల్ కుమార్, డిఎఫ్ఒ శ్రీనివాస్, గార్డెన్ సూపరింటెండెంట్ శ్రీనివాస్, ఎలక్ట్రికల్ డిఇ చంద్రశేఖర్, ప్రచురణల విభాగం ప్రత్యేకాధికారి రామరాజు పాల్గొన్నారు. అంతకు ముందు జెఇఒ వీరబ్రహ్మం రాజంపేటలోని 108 అడుగుల శ్రీతాళ్ళపాక అన్నమాచార్య విగ్రహం ఆవరణంలో జరుగుతున్న అభివృద్ధి పనులను పరిశీలించారు.

అన్యాక్రాంతమైన భూములను పేదలకు పంచాలి

- వ్య.కా.స. రాష్ట్ర ఉపాధ్యక్షులు నాగేశ్వరరావు

ప్రజాశక్తి కడప అర్బన్


సమావేశంలో మాట్లాడుతున్న నాగేశ్వరరావు

జిల్లాలో అన్యక్రాంతమైన భూములను స్వాధీనం చేసుకుని పేదలకు భూపంపిణీ చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎం. నాగేశ్వ రావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధ వారం వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యాలయంలో జిల్లా అధ్యక్షులు జి. శివకు మార్ అధ్యక్షతన భూమి కోసం జిల్లా సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా నాగేశ్వరావు మాట్లాడుతూ రాయలసీమ జిల్లాలలోనే కడప జిల్లాలో ప్రభుత్వ భూములు విస్తారంగా ఉన్నాయని పేర్కొన్నారు. రాజకీయ నాయకులు, పలుకుబడి కలిగిన వారు, ధనవంతులు, అనర్హుల చేతిలో లక్ష ఎకరాలు పైగా అన్యక్రాంతమ య్యాయని, వాటిని స్వాధీనం చేసుకోవడంలో ప్రభుత్వం వైఫల్యం చెందిందని చెప్పారు. పదేళ్లుగా పేదలకు అసైన్డ్ భూములు భూ పంపిణీకి నోచుకోలేదని వాపోయారు. అనర్హులకు మాత్రం రాత్రికి రాత్రే పట్టాలు, పాస్ బుక్కులు రెవెన్యూ అధికారులు ఆన్‌లైన్ చేస్తున్నారని విమర్శించారు. పేదవారు ఒక ఎకరం అసైన్మెంట్ కమిటీ నుంచి పొందలేదన్నారు. జిల్లాలో 5వేల ఎకరాలు హెచ్‌డిసి కింద దళితులకు భూమి పంపిణీ చేశారని, వారికి ఎటువంటి హక్కు పత్రాలు కానీ రైతు భరోసా ఇన్సూరెన్స్, క్రాప్ లోన్లు కానీ వర్తించడం లేదని పేర్కొన్నారు. వెంటనే అన్ని రకాల రుణాలతోపాటు, పట్టాలు, పాసుబుక్కులు ఆన్‌లైన్ చేయాలన్నారు. జిల్లాలో హైవే, గ్రీన్ ఫీల్డ్ రోడ్లకు బలవంతంగా రైతుల వద్ద నుంచి భూమి లాక్కుంటున్నారని విమర్శించారు. వారందరికీ 2013 భూ సేకరణ చట్ట ప్రకారం పరిహారం అమలు చేయాలని డిమాండ్ చేశారు. భూ పంపిణీకి మండల తహశీల్దార్లు, ఎంఎల్ఎలు చెప్పిన పేర్లను మాత్రమే అసైన్‌మెంట్ కమిటీలో పెడుతున్నారని తెలిపారు. ఇది సరైన పద్ధతి కాదని, గ్రామాలలో గ్రామసభలు నిర్వహించి లబ్ధిదారులను ఎంపిక చేసి అసైన్‌మెంట్ కమిటీలో ఆమోదించాలన్నారు. సమావేశంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి వి. అన్వేష్ జిల్లా ఉపాధ్యక్షులు వెంకటేష్, నరసయ్య, వీరయ్య, సహాయ కార్యదర్శులు గురువయ్య, సురేష్, జిల్లా కమిటీ సభ్యులు పోలయ్య, గోవిందు, రాయప్ప, రవణమ్మ పాల్గొన్నారు.

అయోడిన్ ఉప్పుతో పిల్లల్లో ఎదుగుదల

- జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ నాగరాజు

ప్రజాశక్తి-చెన్నూరు

అయోడిన్ ఉప్పు వాడడం వల్ల పిల్లల్లో శారీరక, మానసిక ఎదుగుదలకు ఎంతో ఉపయోగపడుతుందని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ నాగరాజు అన్నారు. బుధవారం ఆయన స్థానిక ప్రజా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. సమాజంలో పోషకాహార స్థితిని అధ్యయనం చేసుకోవడానికి అయోడిన్‌కు సంబంధించి ఒక బృహత్తరమైన కార్యక్రమాన్ని చేపట్టామని చెప్పారు. ముఖ్యంగా పిల్లలలో అయోడిన్ లోపం వల్ల మానసిక తీరు, బలహీనపడటం, శారీరక అభివృద్ధి ఆలస్యం కావడం, అలాగే అయోడిన్ ప్రేరిత హైపర్ థైరాయిడిజం వంటి వాటికి దారితీస్తుందని ఆయన తెలియజేశారు. అయోడిన్ ఉప్పు వాడడం వల్ల శరీరానికి కావాల్సినంత సూక్ష్మ పోషకాలు లభ్యమవుతాయని ఆయన తెలియజేశారు. జిల్లా స్థాయిలో అయోడిన్ లోపం రుగ్మత(ఐడిడి) అంచనాలు వేస్తారన్నారు. ఇందుకు సంబంధించి 90 మంది పిల్లలకు గాయిటర్ అసెస్మెంట్ చేస్తారని చెప్పారు. కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఉప అధికారి ఉమామహేశ్వ రాకుమార్, మండల వైద్యాధికారి డాక్టర్ చెన్నారెడ్డి, డాక్టర్ వంశీకృష్ణ, డాక్టర్ వెంకట చంద్ర రెడ్డి, డాక్టర్ ఖాజా మోదీన్, ప్రధానోపాధ్యాయులు పద్మనాభం, ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

మట్టి మాఫియాకు అడ్డుకట్ట వేయకపోతే ఉద్యమం

ప్రజాశక్తి - పెండ్లిమర్రి

మండలంల మట్టి, ఇసుక మాఫియాకు అడ్డుకట్ట వేయకపోతే ఆందోళన తప్పదని టిడిపి మండల అధ్యక్షులు సంగటి గంగిరెడ్డి పేర్కొన్నారు. బుధవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ నిబంధనలకు విరుద్ధంగా చిన్న దాసరి పల్లె, గంగనపల్లె, మాచనూరు గుట్టల నుంచి మట్టి, నందిమండలం తుమ్మలూరు గ్రామాల పరిధి పాపాగ్ని నది నుంచి ఇసుకను అక్రమార్కులు తరలిస్తున్నారని వాపోయారు. అధికారులు మాత్రం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించడం సరైందని కాదని పేర్కొన్నారు. పేదలు, రైతులు తమ అవసరాలకు తోలుకుంటే అధికారులు ఆగమేఘాలపై వచ్చి వాహనాలు సీజ్ చేయడం, కేసులు బనాయించడంలో చేస్తారని ఆవేదన వ్యక్తం చేశారు. అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేయకపోతే పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు.

కుష్టు వ్యాధి నివారణపై అవగాహన

వల్లూరు : కుష్టు వ్యాధి నివారణపై విద్యార్థులకు అవగాహన తప్పనిసరి అని జిల్లా అడిషనల్ డిఎంహెచ్ఒ ఖాదర్‌వలి పేర్కొన్నారు. బుధవారం ఆదర్శ పాఠశాలలో ప్రిన్సిపల్ సురేష్ బాబు ఆధ్వర్యంలో విద్యార్థులకు కుష్టు వ్యాధిపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహాత్మా గాంధీ వర్ధంతి సందర్భంగా జనవరి 30 నుంచి ఫిబ్రవరి 13 వరకు రాష్ట్రమంతటా పక్షోత్సవాలు నిర్వహిస్తున్నారని చెప్పారు. అందులో భాగంగా అవగాహన ర్యాలీ నిర్వహించి నివారణకు చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. కుష్టు వ్యాధి వ్యాప్తి చెందదని నివారణ తప్పనిసరిగా ఉందని తెలిపారు అనంతరం విద్యార్థులకు అందించే మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో సిహెచ్ఒ వేణుగోపాల్, ఎఎన్ఎంలు, ఆశా వర్కర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఘనంగా ఉరుసు ఉత్సవాలు

కడప అర్బన్ : నగరంలోని రవీంద్రనగర్‌లో వెలసిన ఉన్న హజరత్ సయ్యద్ షా గౌస్ సర్మద్ ఖాద్రి దర్గా ఉరుసు ఉత్సవాలు బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా దర్గాలో పూల చదరులు సమర్పించి, ఫాతిహా చేసి, తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. అనంతరం భక్తులకు అన్నదానం కార్యక్రమన్ని నిర్వహించారు.

జీతాల కోసం ఇంకెన్ని రోజులు ఎదురుచూడాలి

ప్రజాశక్తి - కడప అర్బన్

ప్రతినెలా ఒకటవ తేదీన చెల్లించాల్సిన జీతాలు 8వ తేదీ వచ్చినా చెల్లించకపోవడం, ప్రతినెలా ఉద్యోగ, ఉపాధ్యాయులు జీతాల కోసం ఎదురు చూడాల్సి రావటం సరికాదని యుటియఫ్ రాష్ట్ర కార్యదర్శి లక్ష్మీ రాజా విమర్శించారు. బుధవారం స్థానిక యుటిఎఫ్ భవన్‌లో చెన్నూరు మండల కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గడిచిన కొంతకాలంగా ఒకటవ తేదీన జీతం పడటంలేదని, ఎప్పుడు జీతం పడుతుందో చెప్పేవారు. లేకపోవడం పట్ల తీవ్ర నిరసన తెలిపారు. జీతం మీద ఆధారపడ్డ ఉద్యోగ, ఉపాధ్యాయులను తీవ్ర మానసిక ఇబ్బందులకు ప్రభుత్వం గురి చేస్తుందని, సకాలంలో బ్యాంక్‌లో ఇఎంఐలు చెల్లించకపోవటం వల్ల డిఫాల్టర్‌గా మారాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేసారు. 30 రోజులు పనిచేయించుకొని ఒకటవ తేదీన జీతాలు చెల్లించాల్సిన బాధ్యత ప్రభుత్వానిదని, విస్మరించడం తగదని వాపోయారు. ఇప్పటికైనా ప్రభుత్వం జనవరి నెల జీతం వెంటనే చెల్లించాలని, రాబోయే కాలంలో ఒకటవ తేదీనే జీతాలు జమ చేయడానికి తగు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి పాలెం మహేష్ బాబు, కోశాధికారి నరసింహారావు, చెన్నూరు మండల నాయకులు శ్రీనివాసులు, వీరనారాయణ రంగనాయకులు, మధుసూదన్ రెడ్డి, ఓబులేసు, ప్రసాద్, కిరణ్ కుమార్ పాల్గొన్నారు.

జీతాలు చెల్లించకపోతే ఉద్యమం తప్పదు

పోరుమామిళ్ల: రాష్ట్రంలోని లక్షలాది మంది ఉద్యోగ, ఉపాధ్యాయులకు సంబంధించిన నెలవారీ జీతాలు,పెండింగ్ బిల్లుల చెల్లింపులో ప్రభుత్వం చూపుతున్న నిర్లక్ష్యధోరణి వీడకపోతే ఉద్యమం చేపట్టక తప్పదని ఎస్‌టియు జిల్లా అధ్యక్షుడు పి.రమణారెడ్డి తెలిపారు. బుధవారం పట్టణంలోని ఎస్‌టియు భవన్‌లో రీజనల్ కన్వీనర్ కె.పుల్లయ్య ఆధ్వర్యంలో కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అధ్యక్షులు మాట్లాడుతూ ప్రతి నెలా ఒకటో తేదీన చెల్లించాల్సిన జీతాలు, ఎపుడూ పడతాయో కూడా తెలియని గందరగోళ పరిస్థితులు నెలకొనడం బాధాకరమన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బి. బాలరాజు,వాకా చద్రశేఖర్, జిల్లా కార్యవర్గ సభ్యులు సుబ్బారెడ్డి, రాజగోపాల్ మండలశాఖల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు క్రిష్ణారెడ్డి, సుబ్రమణ్యం, శ్రీనివాసులు, రఘురామిరెడ్డి, బ్దుల్ హుసేన్, రంగారావు, బాలచంద్ర, గురుప్రసాద్ పాల్గొన్నారు.

'ఎగువ భద్ర'తో రాయలసీమకు తీవ్ర అన్యాయం

ప్రజాశక్తి - కడప అర్బన్

తుంగభద్ర డ్యామ్ పై భాగంలో ఎగువభద్ర ప్రాజెక్టు నిర్మాణానికి బిజెపి ప్రభుత్వం రూ 5,300 కోట్ల నిధులను విడుదల చేసి రాయలసీమ రైతాంగానికి తీవ్ర అన్యాయం చేసిందని కడప జిల్లా అఖిలపక్ష నేతలు ఆగ్రహం వ్యక్తం చేశారు. బుధవారం కడప ప్రెస్‌క్లబ్‌లో 'ఎగువ భద్ర ప్రాజెక్టు నిర్మాణం-రాయలసీమ నీటి సమస్యలు' అంశం పైన ఏపీ రైతు సంఘం ఆధ్వర్యంలో జిల్లా అధ్యక్షులు ఎం.వి. సుబ్బారెడ్డి అధ్యక్షతన రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు గుజ్జుల ఈశ్వరయ్య, సిపిఐ జిల్లా కార్యదర్శి గాలి చంద్ర, రాయలసీమ సాగునీటి ప్రాజెక్టుల కన్వీనర్ దేవగుడి చంద్రమౌళీశ్వర్ రెడ్డి , సిపిఎం జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్, ఏపీ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కొమ్మది ఈశ్వరయ్య, ఎఐకెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి దస్తగిరి రెడ్డి, లోక్సత్తా పార్టీ నాయకులు కృష్ణయ్య, బిఎస్పి పార్టీ నాయకులు గుర్రప్ప ,కాంగ్రెస్ పార్టీ నాయకులు సత్తార్ హాజరై ప్రసంగించారు. కేంద్ర ప్రభుత్వం కర్ణాటక రాష్ట్రంలో వచ్చే ఎన్నికల్లో లబ్ధి పొందడానికి ఆ రాష్ట్ర ప్రజలకు ప్రయోజనం చేకూర్చే ఎగువ భద్ర ప్రాజెక్టుకు నిధులు కేటాయించారని విమర్శించారు. పై భాగంలో ఈ ప్రాజెక్టు నిర్మించడం వల్ల దిగువ ప్రాంతంలో ఉన్న రాయలసీమ రైతాంగానికి తీవ్ర అన్యాయానికి గురవుతుందని ఆవేదన వ్యక్తం చేశారు.

అభివృద్ధి పనులు పరిశీలన

కడప అర్బన్ : నగరపాలక కమిషనర్ జి. సూర్య సాయి ప్రవీణ్ చంద్ బుధ వారం నగరంలో అభివృద్ధి పనులను పరిశీలించారు. మాసాపేట రోడ్డు, డ్రైన్, రాజీవ్ పార్క్, రాజీవ్ మార్క్ రోడ్డు పనులను పర్యవేక్షించారు. మాసాపేట రోడ్డు ఇరుపక్కల లెవెల్స్ ఆధారంగా కాలువ, రోడ్డు నిర్మాణ పనులను వేగవంతం చేయాలని పేర్కొన్నారు. నాణ్యత విషయంలో ఎటువంటి జాప్యం ఉండరాదని, ఇళ్ళ ముందు చేరిన మురుగు నీటిని వెంటనే తీయించే విధంగా చర్యలు తీసుకోవాలని ఇంజనీరింగ్ విభాగ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. రాజీవ్ పార్క్‌లో జరుగుతున్న పనులలో భాగంగా లైటింగ్, టాయిలెట్స్ వంటి పనులు నాణ్యతగా పనులను వేగవంతం చేయాలన్నారు.

జాకీర్ హుస్సేన్‌ను గుర్తించుకోవాలి

కడప : భారత దేశానికి మూడవ రాష్ట్రపతిగా జాకీర్ హుస్సేన్ సేవలందించారని, ఆయన సేవలను ప్రతి ఒక్కరూ గుర్తించుకోవాలని జాతీయ మానవ హక్కుల న్యాయవాది షేక్ అమిన్ పీరా అన్నారు. కడప సిఎస్ఐ పాఠశాల వద్ద ఉన్న మానవ హక్కుల కార్యాలయంలో జాకీర్ హుస్సేన్ జయంతి ని బుధవారం నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ఎసి సెల్ ఉపాధ్యక్షులు డా. మల్లెం విజయభాస్కర్ హాజరయ్యారు. కార్యక్రమంలో రాయల్ కరీం సేవా సమితి అబ్దుల్ రాయల్ కరిముల్లా, మైనార్టీ ప్రముఖులు, అబ్దుల్ కలాం, పాల్గొన్నారు.

ప్రొద్దుటూరు డివిజన్ మహిళా చైర్‌పర్సన్‌గా భారతి

ప్రజాశక్తి- కడప అర్బన్

మానవ హక్కుల పరిరక్షణ సంస్థ ప్రొద్దుటూరు డివిజన్ మహిళా చైర్పర్సన్ తిరువీధుల భారతి నియమితులయ్యారు. హెచ్ఆర్‌సిపిఐ నేషనల్ చైర్మన్ సింగమాల వెంకటరమణయ్య బుధవారం నగరంలోని ప్రకాష్ గర్‌లో ఉన్న హెచ్ఆర్‌సిఐప్రధాన కార్యాలయంలో నియామక పత్రం అందజేశారు. జాతీయ చైర్మన్‌కు ఈ సందర్భంగా ఆమె ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. భారతి మాట్లాడుతూ తనను ప్రొద్దుటూరు డివిజన్ మహిళా చైర్పర్సన్ నియమించిన జాతీయ చైర్మన్ ఎస్‌సి రమణయ్యకు, తన నియామకానికి సహకరించిన బోర్డు డైరెక్టర్ డి.శ్యామ్‌కు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా వైవీయూ పూర్వ విద్యార్థి

కడప అర్బన్ : యోగి వేమన విశ్వవిద్యాలయం వృక్ష శాస్త్ర శాఖ పూర్వ విద్యార్థి, ఎకడమిక్ కన్సల్టెంట్ డాక్టర్ గూడూరు కృష్ణ కుమార్ ఢిల్లీలోని శ్రీ వెంకటేశ్వర కళాశాలలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా ఎంపికయ్యారు. ప్రాథమిక విద్య నుంచి ఉన్నత విద్య వరకు ప్రభుత్వ విద్యాసంస్థల్లో చదివిన ఈయన దేశ రాజధానిలో అసిస్టెంట్ ప్రొఫెసర్ గా నియమితులు కావడం పట్ల వి సి ఆచార్య జింక రంగ జనార్ధన్, కుల సచివులు ఆచార్య వై. పి. వెంకటసుబ్బయ్య, ప్రిన్సిపల్ కె. కృష్ణారెడ్డి అభినందించారు.

పరీక్షల విభాగం నూతన కంట్రోలర్ల నియామకం

ప్రజాశక్తి - కడప


శుభాకాంక్షలు తెలియజేస్తున్న డాక్టర్ ఆర్. నీలయ్య

ప్రభుత్వ పురుషుల కళాశాలలో పరీక్షల విభాగానికి సంబంధించి నూతన కంట్రోలర్, డిప్యూటీ కంట్రోలర్ నియ మితు లయ్యారని ప్రధాన ఆచార్యులు జి.ర వీంద్రనాథ్ పేర్కొన్నారు. కంట్రోలర్‌గా జియాలజీ అధ్యపకులు డాక్టర్ జి. రామకృష్ణ, అసిస్టెంట్ కంట్రోలర్‌గా మనోహర్‌రెడ్డి నియమితులయారని చెప్పారు. బుధవారం వారు బాధ్యతులు చేపట్టారు. వారిని జిసిటిఎ జిల్లా కార్యదర్శి డాక్టర్ ఆర్. నీలయ్య, జోనల్ అధ్యక్షులు డాక్టర్ కృష్ణారెడ్డి, కళాశాల సిబ్బంది డాక్టర్ హరిప్రసాద్, డాక్టర్ సురేష్ బాబు, శివరామకృష్ణ, హజరతయ్యా, పరీక్షల విభాగ సిబ్బంది నాయక్, శివ, ఉదయ్ అభినందనలు తెలియజేశారు.

కార్యకర్తలకు అండగా ఉంటాం

కాశినాయన : బద్వేల్ నియోజకవర్గంలో టిడిపి కార్యకర్తలకు అందుబాటులో ఉంటూ వారికి అండగా ఉంటామని టిడిపి ర్టీ కడప పార్లమెంటు మహిళా అధ్యక్షురాలు కర్నాటి శ్వేతా రెడ్డి అన్నారు బుధవారం ఆమె మిద్దెల దళితవాడలో రాములవారి ఆలయ నిర్మాణానికి భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బద్వేలు నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీని బలోపేతం చేసేందుకు కృషి చేద్దామని పిలుపునిచ్చారు. తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వచ్చేందుకు ప్రతి ఒక్కరూ కష్టపడాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంపిటిసి గౌసియా మాజీ సర్పంచ్ కె.వి సుబ్బారెడ్డి, ఉపసర్పంచ్ నాగేందర్ రెడ్డి, టిడిపి కార్యకర్తలు, నాయకులు పాల్గొన్నారు

క్రిస్టియన్ మైనార్టీ కార్పొరేషన్‌కు నిధులు కేటాయించాలి

ప్రజాశక్తి - కడప అర్బన్

క్రిస్టియన్ మైనారిటీ కార్పొరేషన్‌కు నిధులు కేటాయించాలని టిడిపి క్రిస్టియన్ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎం.పి. సురేష్ డిమాండ్ చేశారు. బుధవారం కలెక్టరేట్ ఎదురు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసిపి అధికారంలోకి వచ్చి నాలుగేళ్లవుతున్నా కార్పొరేషన్ ద్వారా ఒక్క రూపాయి లేకుండా నిధులు మళ్లించడం బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు. చర్చ్ (మందిరాలకు)అభివృద్ధికి నిధులు లేవని వాపోయారు. జరుషాలేం యాత్రకు వెళ్లే వారికీ ఇచ్చే రుణసహాయం ఇవ్వలేదని వాపోయారు. ధర్నాలో టిడిపి రాష్ట్ర బి. సి. సాధికారిత కన్వీనర్ యాటగిరి రామ్ ప్రసాద్, ఎస్‌సి సెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి రాజశేఖర్, ఎస్‌టి సెల్ నగర అధ్యక్షులు భాస్కర్, కార్యదర్శి ముని, గోవర్ధన్ గవర్దన్, ఎస్‌సి సెల్ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి సుబ్బరాయుడు, కడప పార్లమెంట్ క్రిస్టియన్ సెల్ అధ్యక్షులు ప్రేమ్ కుమార్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వైద్యాధికారి డాక్టర్ శాంతికళ

అయోడిన్ లోపిస్తే ప్రమాదం

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

అయోడిన్ లోపం ఉన్న వారు నిర్లక్ష్యం వహిస్తే ప్రమాదంలో పడతారని జిల్లా ఉప వైద్య, ఆరోగ్య శాఖధికారి డాక్టర్ శాంతికళ పేర్కొన్నారు. బుధవారం నేషనల్ అయోడిన్ డెఫిసియన్సీ డిసార్డర్ కంట్రోల్ ప్రోగ్రావ్ లో భాగంగా స్థానిక రూరల్ పరిధిలో ఉన్నటీచర్స్ కాలనీలోని రాఘవేంద్ర హైస్కూల్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అయోడిన్‌తో హార్మోన్లు శరీరంలోని వివిధ జీవక్రియలు సక్రమంగా సాగేందుకు దోహదం చేస్తుందన్నారు. శరీరంలో వివిధ అవయవాల ఎదుగుదలకు అయోడిన్ ఉపయోగపడుతుందని, ముఖ్యంగా మెదడు పెరుగుదలకు ఇది ఎంతో అవసరమని చెప్పారు. అయోడిన్ లోపం ఉన్నట్లయితే జీవక్రియ నశిస్తుందని, దీని వల్ల అలసట, బలహీనత, అసహనం, బరువు పెరగడం వంటివి ఏర్పడతాయని చెప్పారు. ఎక్కువ సమస్యలు ఎదుర్కొనేది గర్భిణులు, పసిబిడ్డలేనన్నారు. తగిన మోతాదులో అయోడిన్ అందకపోతే హైపోథైరాయిడ్‌కు దారితీస్తుందన్నారు. అయోడిన్ లోపం వల్ల వచ్చే గాయిటర్ వ్యాధి నిర్ధారణ కోసం విద్యార్థులను వైద్యాధికారి డాక్టర్ శివప్రసాద్ రెడ్డి పరీక్షలు నిర్వహించారు. అనంతరం కొంతమంది విద్యార్థులను ఇంటికి పంపించి వారు వాడే ఉప్పు తెప్పించుకుని పరీక్షలకు పంపారు. కార్యక్రమంలో హెల్త్ ఎడ్యుకేటర్ వెంకటేశ్వర్లు, హెచ్ఇఒలు వెంకటేశ్వర్లు, రాజశేఖర్, హెడ్ మాస్టర్ కిరణ్మయి, సిహెచ్ఒ మౌనిక, ఎఎన్ఎం శ్యామల, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

రేపటి నుంచి రామాలయం ప్రతిష్ట మహోత్సవం

ప్రజాశక్తి - చాపాడు

మండల పరిధిలోని నాగాయపల్లెలో నూతనంగా నిర్మించిన శ్రీ సీతారామ లక్ష్మణ హనుమత్ సమేత విగ్రహ ప్రతిష్ట మహోత్సవ కార్యక్రమాన్ని శుక్రవారం నుంచి ఆదివారం వరకు నిర్వహించనున్నట్లు గ్రామ పెద్దలు తెలిపారు. శుక్రవారం గణపతి, గోపూజతో ప్రారంభమై శనివారం యంత్రాభిషేకం రుద్ర, చంద్ర హోమాలు, గ్రామోత్సవం ఆదివారం విగ్రహ ధ్వజ ప్రతిష్ట సీతారాముల కల్యాణం నిర్వహిస్తున్నట్లు వారు తెలిపారు. విగ్రహ ప్రతిష్ట సందర్భంగా శుక్రవారం నుంచి ఆదివారం వరకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు వారు తెలిపారు. ఆదివారం న్యూ కేటగిరి వృషభరాజుల బండలాగుడు పోటీలను నిర్వహిస్తామన్నారు. పోటీలలో విజేతగా నిలిచిన మొదటి బహుమతిగా రూ. 40 వేలు, 2వ బహుమతి రూ. 30 వేలు, 3వ బహుమతి రూ. 20వేలు, 4వబహుమతిగా రూ. 10వేలు, 5వ బహుమతి రూ. 5వేలు అందజేయనున్నట్లు వారు తెలిపారు.



జెసిబితో చదును చేస్తున్న సిబ్బంది

నక్కలదిన్నె రోడ్డుకు మరమ్మతులు

-ప్రజాశక్తి వార్తకు స్పందన

ప్రజాశక్తి - చాపాడు

మండల పరిధిలోని నక్కలదిన్నె- వెదురూరు గ్రామాల మధ్య అధ్వానంగా ఉన్న ఆర్అండ్‌బి రోడ్డుకు మరమ్మతులు చేపడుతున్నారు. ఈనెల 5న ఆదివారం 'ప్రమాదాలకు నిలయం.. వెదురూరు రోడ్డు' అనే వార్త కథనం ప్రజాశక్తిలో ప్రచురితమైంది. స్పందించిన అధికారులు సమస్యను గుర్తించి రోడ్డు మరమ్మతులు చేపట్టేందుకు చర్యలు చేపట్టారు. నక్కలదిన్నె నుంచి తిప్పిరెడ్డిపల్లి గ్రామం వరకు రూ.9 లక్షలతో మరమ్మతులకు చర్యలు తీసుకున్నామని ఎఇ దాదాబాషా తెలిపారు. బుధవారం అందుకు సంబంధించి పనులు ప్రారంభించారు. జెసిబితో దెబ్బతిన్న ప్రదేశాలను తవ్వి రోడ్డుకు మరమ్మతులు చేపడుతున్నారు. కొన్ని రోజులుగా అధ్వానంగా ఉన్న రోడ్డుపై ద్విచక్ర వాహన దారులు ప్రమాదాల బారిన పడి గాయాల పాలయ్యారు. ప్రస్తుతం రోడ్డుకు మరమ్మతులు చేపడుతుండడంతో ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.



భూమిపూజ నిర్వహిస్తున్న ఎమ్మెల్యే రాచమల్లు

గ్రామాభివృద్దే ప్రభుత్వ లక్ష్యం

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

పంచాయతీలు అభివృద్దే ధ్యేయంగా, గ్రామాభివృద్దే లక్ష్యంగా వైసిప ప్రభుత్వం ముందుకు సాగుతోందని ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద్ రెడ్డి పేర్కొన్నారు .బుధవారం కొత్తపల్లి పంచాయతీ పరిధిలోని కానపల్లి గామంలో రూ.15 లక్షల పంచాయతీ నిధులతో కల్వర్టు, కాలువల నిర్మాణ పనులకు ఎమ్మెల్యే రాచమల్లు భూమి పూజ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వ హయాంలో నియోజకవర్గ పరిధిలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టి, ప్రజలకు మౌలిక వసతుల కల్పిస్తున్నామని చెప్పారు. అందులో భాగంగా నేడు కానపల్లె గ్రామంలోని మడూరు కాలువపై మోరీ నిర్మాణం చేపడుతున్నామన్నారు. కార్యక్రమంలో కొత్తపల్లె పంచాయతీ సర్పంచ్ కొనిరెడ్డి శివ చంద్రా రెడ్డి, 3వ వార్డు మెంబర్ కొనిరెడ్డి రమణా రెడ్డి, యువ నాయకుడు కొనిరెడ్డి హర్షవర్ధన్ రెడ్డి, పలువురు వైసీపీ నాయకులు, కానపల్లె గ్రామస్తులు పాల్గొన్నారు.

హెచ్ఐవిపై అవగాహన అవసరం

ప్రజాశక్తి - చాపాడు

హెచ్ఐవిపై అవగాహన అవసరమని పంచాయతీ కార్యదర్శి భాగ్యలక్ష్మి పేర్కొన్నారు. బుధవారం మండల పరిధిలోని మడూరులో ఎయిడ్స్ నియంత్రణ సంస్థ చైల్డ్ ఫండ్ ఇండియా లింకు వర్కర్స్ స్కీం వారి ఆధ్వర్యంలో వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా పంచాయతీ కార్యదర్శి మాట్లాడుతూ హెచ్ఐవి అవగాహన ద్వారానే నియంత్రించవచ్చున్నారు. హెచ్ఐవి సోకడం వల్ల కలిగే నష్టాలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో చైల్డ్ ఫండ్ వర్కర్స్ స్కీం సూపర్‌వైజర్ దర్బార్, వైద్య సిబ్బంది నారాయణరెడ్డి, ఎంపిహెచ్ఒ, ఎఎన్ఎం, సిబ్బంది సురేంద్ర, అమీర్, ప్రజలు పాల్గొన్నారు.

నేటి నుంచి తిరుమలకు పాదయాత్ర

ప్రజాశక్తి-ప్రొద్దుటూరు

మాజీ ఎంఎల్ఎ వరదరాజులరెడ్డి ఆధ్వర్యంలో గురువారం నుంచి తిరుమలకు 400 మందితో పాదయాత్ర నిర్వహించనున్నట్లు వంగలి నారాయణరెడ్డి తెలిపారు. గత సంవత్సరం ఇలాగే 300 మందితో పాదయాత్ర చేసినట్లు ఆయన గుర్తు చేశారు. 'అందరూ బాగుండాలి అందులో మనం ఉండాలనే' భావనతో ఈ పాదయాత్ర కార్యక్రమాన్ని కొనసాగిస్తున్నట్లు ఆయన తెలిపారు. గురువారం ఉదయం టిటిడి కళ్యాణమండపం నుండి పాదయాత్ర ప్రారంభమవుతుందని చెప్పారు. భోజనవసతి, తిరుమలలో దర్శన సౌకర్యం కల్పిస్తామన్నారు. ఖాజీపేట, కడప, ముక్కావారిపల్లి, రైల్వేకోడూరు, కుక్కలదొడ్డి, అన్నమయ్యగుంట మీదుగా తిరుమలకు పాదయాత్రగా చేరుకుంటామన్నారు. ఫిబ్రవరి15న దర్శనం అనంతరం తిరుగుప్రయాణం అవుతాయని తెలిపారు. తమ పాదయాత్రలో మహిళలు కూడా పాల్గొనేందుకు ఉత్సాహం చూపడం విశేషమని నారాయణరెడ్డి తెలిపారు.

మైనింగ్ నిర్వాహకుల హామీలు గాలికి

- ప్రజాభిప్రాయ సేకరణలో బాధిత గ్రామస్తుల ఆవేదన

ప్రజాశక్తి - ముద్దనూరు

మైనింగ్ నిర్వహణ సమయంలో గ్రామాల్లో అభివృద్ధి కార్యక్రమాలు చేపడతామని ప్రజలకు, పంటలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూస్తామని ఏడాది కిందట నిర్వాహకులు తమకు హామీలిచ్చి ప్రస్తుతం అమలు చేయకుండా గాలికి వదిలేశారని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు. మండలంలోని కొత్తచౌటిపల్లె గ్రామ సమీపంలోని కొండలో చేపడుతున్న మైనింగ్‌వల్ల సమస్యలు ఎదుర్కొంటున్నామని ప్రజలు ఆవేదన వ్యక్తం చేశారు. బుధవారం డిఆర్ఒ గంగాధర్ ఆధ్వర్యంలో మండలంలోని శెట్టిపల్లి గ్రామ సమీపంలోని నూతన సచివాలయంలో మంగపట్నం, కొత్త చౌటిపల్లె, గ్రామస్తులతో పర్యావరణ ప్రజాభిప్రాయ సేకరణను ప్రజాభిప్రాయ సేకరణ సభ నిర్వహించారు. మంగపట్నం కొండలో మెస్సెర్స్ ప్లానెట్ మైన్స్ అండ్ మినరల్ క్వార్ట్జైట్ క్వారీ, మెస్సెర్స్ ముకుంద మైన్స్ అండ్ మినరల్స్ క్వార్ట్జైట్ క్వారీ నిర్వహణకు సంబంధించి ప్రజలు తాము ఎదుర్కొంటున్న సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. ఏడాదిగా మంగపట్నం కొండలో కొత్త చౌటిపల్లి గ్రామానికి సమీపంలో ఒక మైన్స్ అండ్ మినరల్స్ వారు మైనింగ్ పనులు చేపడుతున్నారన్నారు. గతంలో నీటి నిల్వ కోసం ఇక్కడ ఏర్పాటు చేసిన చెక్ డ్యాంను మైనింగ్ నిర్వాహకులు ధ్వంసం చేశారన్నారు. మైనింగ్‌లో చేపడుతున్న బ్లాస్టింగ్ ధాటికి ఇళ్లకు నెర్రలు ఏర్పడుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. గండికోట జలాశయం ప్రాజెక్టు కోసం గ్రామాన్ని ఖాళీ చేసి పునరావాస కేంద్రానికి వచ్చామన్నారు. మైనింగ్ వల్ల ఇక్కడ ఉండే పరిస్థితి లేదని ఆందోళన వ్యక్తం చేశారు. పాడి,పశు పెంపకం, వ్యవసాయంపై ఆధారపడి జీవిస్తున్నామన్నారు. మైనింగ్ వల్ల వాతావరణం, తాగునీరు, పంటలు కాలుష్యం అవుతున్నాయన్నారు. చీనీ చెట్లు దెబ్బతింటున్నాయని తెలిపారు. మరికొన్ని మైనింగులు వస్తే తమ పరిస్థితి ఏంటని ప్రశ్నించారు. అధికారులు పరిశీలించి న్యాయం చేయాలని గ్రామస్తులు కోరారు. మైనింగ్ నిర్వాహకులు మాట్లాడుతూ మైనింగ్ సమీప ప్రాంతాల్లోని గ్రామాల ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కల్పించమన్నారు. పచ్చదనాన్ని పెంపొందించేలా మొక్కలు నాటి సంరక్షిస్తామన్నారు. పేలుడు వల్ల ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూస్తామన్నారు. స్థానికులకు ఉద్యోగ,ఉపాధి అవకాశాలు ఇస్తామన్నారు. ప్రజాభిప్రాయం సమ్మతితోనే మైనింగ్ నిర్వహిస్తామన్నారు. డిఆర్ఒ గంగాధర్ మాట్లాడుతూ ప్రజల, మైనింగ్ నిర్వాహకుల అభిప్రాయాలను ఉన్నతాధికారులకు నివేదిస్తామన్నారు. కార్యక్రమంలో తహశీల్దార్ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు. ఎస్ఐ చంద్ర మోహన్ సిబ్బందితో బందోబస్తు నిర్వహించారు.



ప్రజాభిప్రాయ సేకరణ సభలో మాట్లాడుతున్న డిఆర్ఒ గంగాధర్

అర్హులందరికీ సంక్షేమ పథకాలు : ఎమ్మెల్యే


ప్రజాశక్తి-మైలవరం

అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమ పథకాలు అందించడమే వైసిపి ప్రభుత్వ ధ్యేయమని జమ్మలమడుగు ఎమ్మెల్యే డాక్టర్ సుధీర్ రెడ్డి అన్నారు. బుధవారం మండల పరిధిలోని వేపరాలలో గడపగడపకు మన ప్రభుత్వం అనే కార్యక్రమంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ ప్రతి ఇంటికీ వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాల గురించి వివరించారు. అర్హులై ఉండి ఏవైనా పథకాలు అందకపోతే సచివాలయాలకు వెళ్లి దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. తమ ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను నెరవేరుస్తూ తక్కువ కాలంలోనే పేదల హృదయాలలో చెరగని ముద్ర వేసుకుందని ,దీనివల్ల అన్ని వర్గాల ప్రజలు సంతృప్తికరంగా ఉన్నారని అన్నారు. అనంతరం గ్రామంలోని పళ్ళ తిరుమలయ్య అనే వ్యక్తికి ఆరోగ్యం బాగా లేదన్న విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి రూ. 20వేల ఆర్థిక సహాయాన్ని అందజేశారు. కుటుంబ సభ్యులు ఎంఎల్ఎ కృతజ్ఞతలు తెలిపారు. గ్రామంలో చేనేత కుటుంబాలు చాలా ఉన్నాయని వారికీ పథకాలు వర్తింపజేస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఎంపిపి సావిత్రమ్మ, చెన్నకేశవరెడ్డి, వినయ్ కుమార్‌రెడ్డి, కుమార్, అధికారులు , వైసిపి కార్యకర్తలు ప్రజలు పాల్గొన్నారు.



ప్రజలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి

ముస్లిమ్ శ్మశాన వాటికను అభివృద్ధిపరచాలి



కమిషనర్‌కు వినతి పత్రం అందజేస్తున్న వైస్ చైర్మన్

ప్రజాశక్తి-ప్రొద్దుటూరు

పట్టణంలోని జామియా మసీదువద్ద ఉన్న ముస్లిమ్ శ్మశానవాటికను అభివృద్ధి పరచాలని మున్సిపల్ వైస్ చైర్మన్ ఖాజామెహిద్దీన్ (ఆయిల్‌మిల్ ఖాజా) కోరారు. బుధవారం మున్సిపల్ కమిషనర్ వెంకటరమణయ్యను కలసి వినతిపత్రం సమర్పించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ శ్మశానవాటికను ఎలాంటి అభివృద్ధికి నోచుకోకపోవడం వల్ల ఇబ్బందులకు గురి అవుతున్నారన్నారు. చెత్తాచెదారం, ముళ్లచెట్లతో నిండి ఉందన్నారు. ప్రాంతంలో చిమ్మ చీకటి రాజ్యమేలుతోందన్నారు. శ్మశానవాటికలో కొత్త సిసిరోడ్లు, లైటింగ్ ఏర్పాటు చేయాలని కోరారు. శుభ్రం చేసి సదుపాయాలు కల్పించాలన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు మునీర్, మహమ్మద్‌గౌస్, మైనార్టీ నాయకులు ఇద్రీస్, చాంద్‌బాష, అబ్దుల్‌రసూల్, లిబర్టీ గైబుసా, ఖదీర్, ఖాజాఉస్మాన్, రాజాపాల్గొన్నారు.**బాధితులకు అండగా ఉండాలి..** బాధితులకు అండగా ఉండి వారికి ధైర్యాన్ని ఇచ్చినప్పుడే నాయకత్వం అనిపించుకుంటుందని మున్సిపల్ వైస్ చైర్మన్ ఖాజా మెహిద్దీన్ అన్నారు.12వ వార్డు మసీదు వెకనభాగంలో నివాసమున్న పేద ముస్లిమ్ మహిళకు బుధవారం రూ.10వేల ఆర్థిక సాయం చేశారు. 12వ వార్డులో పర్యటిస్తున్న సమయంలో బాధితురాలి సమస్య తన దృష్టికి వచ్చిందన్నారు. అనారోగ్య కారణంగా అపరేషన్ చేయించుకున్న అనంతరం ఆర్థిక సాయం చేశానని తెలిపారు.

ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయాలి

ప్రజాశక్తి - వేంపల్లె

రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన జగనన్న కాలనీల్లో ఇంటి నిర్మాణాలు వేగవంతం చేసేందుకు గ్రామ సచివాలయం సిబ్బంది కృషి చేయాలని మండల స్పెషల్ ఆఫీసర్ డాక్టర్ రవీంద్రారెడ్డి అన్నారు. బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో జగనన్న కాలనీల్లో నిర్మిస్తున్న ఇంటి నిర్మాణాలపై గ్రామ సచివాలయం సిబ్బందితో సమీక్షా సమావేశం నిర్వహించారు. గ్రామాల వారిగా ఇంటి నిర్మాణాలపై అయా ఇంజినీరింగ్ సిబ్బందితో చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లబ్ధిదారులు గడువులోగా ఇంటి నిర్మాణాలు చేసేందుకు చర్యలు చేపట్టాలని కోరారు. ఇంటి నిర్మాణాలు ఇంత వరకు చేపట్టిన లబ్ధిదారులతో చర్చించి ఇంటి పనులు మొదలు పెట్టేందుకు కృషి చేయాలన్నారు. ఇంటి నిర్మాణాలు చేపట్టక పోతే స్థలాలు రద్దు చేస్తామని చెప్పాలని తెలిపారు. రోజూ కాలనీలను గ్రామ సచివాలయం సిబ్బంది పరిశీలిస్తూ లబ్ధిదారులు త్వరితగతిన ఇంటి పనులు పూర్తి చేసేందుకు సలహాలు ఇస్తుండాలని చెప్పారు. సమావేశంలో ఎంపిడిఒ మల్లి కార్జునరెడ్డి, వెలుగు ఎపిఎం బాలస్వామి, గ్రామ సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న టిడిపి మాజీ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ మహమ్మద్ షబ్బీర్

జగన్‌కు పేదల ఉసురు తగలడం ఖాయం

ప్రజాశక్తి - వేంపల్లె

టిడిపి హయాంలో నిర్మించుకున్న గృహాలకు బకాయిలు సిఎం జగన్ మోహన్ రెడ్డి మంజూరు చేయక పోవడంతో అ పేదల ఉసురు తగలడం ఖాయమని టిడిపి మాజీ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ మహమ్మద్ షబ్బీర్, టిడిపి జిల్లా ఉపాధ్యక్షులు జగన్నాథరెడ్డి పేర్కొన్నారు. బుధవారం వేంపల్లెలో వారు విలేకరులతో మాట్లాడుతూ గత తెలుగుదేశం పార్టీ ప్రభుత్వ హయాంలో ఎన్టీఆర్ గృహకల్ప పథకం కింద 2014 నుంచి 2018 వరకు దాదాపు కొన్ని లక్షల మందికి ఇల్లు మంజూరు చేశారని తెలిపారు. వాటికి బిల్లులు కూడా చెల్లించారని చెప్పారు. అయితే 2018 - 2019 మధ్య చివరగా మంజూరైన 80వేల పక్కా గృహాలు నిరుపేదలు ఇళ్లు అయిందన్న ఆశతో అప్పులు చేసి గృహాలు నిర్మించుకున్నారని చెప్పారు. ప్రభుత్వం మారడంతో ప్రస్తుతం ఇంటి నిర్మాణాలు చేసుకున్న లబ్ధిదారులకు బిల్లులు మంజూరు కాక పోవడంతో ఇంటి నిర్మాణానికి చేసిన అప్పులకు వడ్డీలు అధికమై ప్రజలు ఇబ్బందులు పడుతున్నట్లు చెప్పారు. వైసిపి ప్రభుత్వం ఏర్పడి నాలుగేళ్లవుతున్నా టిడిపి ప్రభుత్వంలో నిర్మించుకున్న పక్కా గృహాలకు రాష్ట్రవ్యాప్తంగా రూ. 800 కోట్ల బకాయి బిల్లులు ఇప్పటివరకూ చెల్లించకుడా కుంటి సాకులు చెబుతున్నారని వాపోయారు. బకాయిలు మంజూరు కాక పోవడంతో ఇంటి నిర్మాణాలు చేసుకొన్న పేదవారికి సిఎం జగన్ శాపంగా మారినట్లు చెప్పారు. టిడిపి హయాంలో నిర్మించుకున్న గృహాలకు బకాయి బిల్లులను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. విలేకరుల సమావేశంల వార్డు మాజీ సభ్యులు నల్లగారి కృష్ణారెడ్డి, పూల అల్లాబక్షు, దేవస్థానం మాజీ సభ్యులు పి.వి రమణ, తిప్పారెడ్డి, గొటూరు నాగభూషణం, వాణిజ్య విభాగం మాజీ సభ్యుడు దొంతు సుమన్, టిడిపి మండల మైనార్టీ ఉపాధ్యక్షులు షేక్ ఇలియాస్, టిడిపి మండల మైనార్టీ ప్రధాన కార్యదర్శి మాబు షరీఫ్, శివయ్య, హబీబ్, బాబు పాల్గొన్నారు.



విజేతలతో పాఠశాల కరస్పాండంట్ బీరం సుబ్బారెడ్డి, అధ్యాపకులు

'బీరం' విద్యార్థులకు సన్మానం

ప్రజాశక్తి -ఖాజీపేట

మండల పరిధిలోని కొత్త నెల్లూరు సమీపంలోని బీరం శ్రీధర్ రెడ్డి ఇంటర్నేషనల్ స్కూల్, బీరం శ్రీధర్ రెడ్డి జూనియర్ కళాశాలకు చెందిన ఇంటర్ విద్యార్థులు ఇటీవల విడుదలైన జెఇఇ మెయిన్స్ ఫలితాల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచి తమ సత్తాను చాటారు. కళాశాల ప్రారంభించిన మొదటి బ్యాచ్‌తోనే మెయిన్స్ 2023 ఫలితాలలో సంచలన విజయం సాధించి ప్రభంజనాన్ని సృష్టించిందన్నారు. విద్యార్థులు అత్యధిక మార్కులతో జాతీయస్థాయిలో ర్యాంకులు పొందిన సందర్భంగా బుధవారం కళాశాలలో ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో సన్మానించి అభినందించారు ఈ సందర్భంగా కళాశాల యాజమాన్య ప్రతినిధులు బీరం శ్రీధర్ రెడ్డి, కరస్పాండెంట్ బీరం సుబ్బారెడ్డి, చైర్ పర్సన్ సరస్వతమ్మ మాట్లాడుతూ కష్టపడి చదివి గొప్ప ఫలితాలను సాధించిన విద్యార్థులు అభినం దనీయులని చెప్పారు. భవిష్యత్తులో జెఇఇ అడ్వాన్స్‌డ్. నీట్ వంటి జాతీయస్థాయి పరీక్షల్లో తమ విద్యార్థులు ఉన్నత ర్యాంకులు సాధిస్తారనన్న ఆశాభావాన్ని వారు వ్యక్తపరిచారు. కార్యక్రమంలో డైరెక్టర్ స్వాతి శ్రీకాం త్, ప్రిన్సిపాళు భాస్కర్‌రెడ్డి, మోహన్‌రెడ్డి, స్కూల్ ప్రిన్సిపల్ శ్వేత పాల్గొన్నారు.

రవీంద్రారెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలి

ప్రజాశక్తి - పులివెందుల రూరల్

పట్టభద్రుల వైసిపి ఎంఎల్‌సి ఎమ్మెల్సీ అభ్యర్థి రవీంద్రారెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని నాయకులు, కడియాల లక్ష్మీనారాయణ, రాష్ట్ర సివిల్ సప్లై డైరెక్టర్ గంగాధర్ రెడ్డి, కౌన్సిలర్ ఖాదర్లు ఓటర్లను కోరారు. బుధవారం మున్సిపాలిటీ పరిధిలోని స్థానిక 5 వార్డు జెండా మాను వీధి, శ్రీనివాస థియేటర్ రోడ్డు, కచేరి రోడ్డు ప్రాంతాలలో ప్రాంతాలలో ఎమ్మెల్సీ ఎన్నికలకు అర్హులైన ఓటర్ల ఇళ్ల వద్దకు వెళ్లి ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు లక్ష్మీనారాయణ, శ్రీరాములు, డేనియల్ గంగరాజు పాల్గొన్నారు.

పర్యాటకులను ఇబ్బంది పెడితే టెంట్లు ఎత్తేస్తాం : ఆర్‌డిఒ

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

పర్యాటకులను, ప్రజలను ఇబ్బంది పెట్టేలా టెంట్ల నిర్వాహకులు ప్రవర్తిస్తే ఆ టెంట్లను పీకి కాలువలలో పడేస్తామని రెవెన్యూ డివిజనల్ అధికారి శ్రీనివాసులు తెలిపారు. బుధవారం స్థానిక ఆర్‌డిఒ కార్యాలయంలో నిర్వాహకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇకనుంచి గండికోట గ్రామాన్ని పూర్తిస్థాయిలో పర్యవేక్షిస్తామన్నారు. గండికోటలో చేపట్టే పనులన్నీ క్రమబద్ధీకరణ చేస్తామన్నారు. కలెక్టర్ ఏర్పాటు చేసిన గ్రామ అభివృద్ధి కమిటీ మేరకు అన్ని నిర్ణయాలు చేస్తామన్నారు. టెంట్లు ఎలా వేయాలి.? ఎక్కడ వేయాలి ? ఎంత తీసుకోవాలి? అందులో గ్రామ అభివృద్ధికి ఎంత చెల్లించాలి? అనే విషయాన్ని కూడా ప్రకటిస్తామన్నారు. రొటేషన్ పద్ధతిలో అందరికీ టెంట్ల విషయంలో అవకాశం కల్పిస్తామన్నారు. ఇకమీదట కమిటీ నిర్ణయించిన నిర్ణయాలను అమలు చేయాలని హెచ్చరించారు. జిల్లా పర్యాటక శాఖ అధికారి మల్లికార్జున, తహశీల్దార్ తిరుపతయ్య, గ్రామ సర్పంచ్ గురు ఈశ్వర్, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

పులి అడుగుల గుర్తింపు...!

ప్రజాశక్తి - చాపాడు



మైదుకూరు మండలం ముదిరెడ్డిపల్లి బీట్, నల్లమల అటవీ ప్రాంతంలోని అంకాలమ్మ బావి (ఎముకల బావి) సమీపంలో పులి అడుగులు గుర్తించినట్లు రచయిత, చరిత్ర పరిశోధకుడు బొమ్మిశెట్టి రమేష్ తెలిపారు. తిప్పిరెడ్డిపల్లె సుగాలి తండాల నుంచి రెండు కిలోమీటర్ల దూరంలో అంకాలమ్మ బావి ఉందని ఆయన చెప్పారు. ఇక్కడే అంకాలమ్మ ఆలయం కూడా ఉందని అన్నారు. ఈ ప్రాంతంలో పులి రోజు విడిచి రోజు సంచరిస్తున్నట్లు అడుగులు కనిపిస్తున్నాయన్నారు. గతంలో 'వనూరమ్మ ఎదురులేని పాలెగత్తె..!' అనే పుస్తక పరిశోధనలో భాగంగా తిప్పిరెడ్డిపల్లె పుట్ట కనుమ నుంచి శివుని శెలకు వెళ్లే దారిలో పులి అడుగులను గుర్తించినట్లు, వాటిని రికార్డు చేసినట్లు రమేష్ తెలిపారు. పులి అడుగుల సమాచారం ఎఫ్ఆర్ఒరమణారెడ్డి, అసిస్టెంట్ బీట్ ఆఫీసర్ సి.వి రామయ్య నిర్ధారించారని పరిశోధకుడు తెలిపారు.



మాట్లాడుతున్న ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి వినయ్ కుమార్

'ప్రజ్ఞా వికాసం' పరీక్షను విజయవంతం చేయాలి

ప్రజాశక్తి- జమ్మలమడుగు

భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (యుటిఎఫ్) జిల్లా కమిటీల ఆధ్వర్యంలో ఎంఎల్‌సి లక్ష్మణ రావ్ పర్యవేక్షణలో పదవ తరగతి విద్యార్థులకు నిర్వహించనున్న ప్రజ్ఞా వికాసం పరీక్షను జయప్రదం చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి ఎ. వినయ్ కుమార్ పిలుపునిచ్చారు. బుధవారం ఆయన మాట్లాడుతూ నిరంతరం విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం పోరాడుతూ విద్యార్థులను చదువుల్లోనూ ముందుండాలని కోరుకుంటూ పదవ తరగతి విద్యార్థులకు ప్రజ్ఞా వికాసం మోడల్ పరీక్షను ఈనెల 20న జిల్లా వ్యాప్తంగా నిర్వహిస్తున్నామని వారు తెలిపారు. విద్యార్థులను పోటీ ప్రపంచంలో పబ్లిక్ పరీక్షలకు సిద్ధం చేసేందుకు, పరీక్షలు అంటే భయం పోగొట్టేందుకు నిర్వహిస్తున్నామని వారు తెలిపారు. ఈ పరీక్ష 100 మార్కులకు ఉంటుందని, ప్రశ్నపత్రం లో అన్ని సబ్జెక్టులకు సంబంధించిన ప్రశ్నలు వుంటాయని వారు తెలిపారు. మధ్యాహ్నం 2 గంటల నుంచి 4 గంటల వరకు ఉంటుందన్నారు. పరీక్షకు ఎంట్రీ ఫీజు రూ.30 చెల్లించాలన్నారు. కార్యక్రమంలో సుభాస్, సుదర్శన్, ఇమామ్, మోహన్ పాల్గొన్నారు. వివరాలకు 9912921048లో సంప్రదించాలని వారు తెలిపారు.

తనిఖీ పక్కాగా నిర్వహించాలి

ప్రజాశక్తి - చాపాడు

మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద మండల వ్యాప్తంగా జరిగిన పనులపై సామాజిక తనిఖీ పక్కాగా నిర్వహించాలని జిల్లా విజిలెన్స్ అధికారి యోగానంద రెడ్డి పేర్కొన్నారు. స్థానిక స్త్రీ శక్తి భవనం వద్ద బుధవారం 2021-22 ఏడాదిలో జరిగిన ఉపాధి హామీ పనులపై ఎస్ఆర్‌పి, డిఆర్‌పి, సామాజిక తనిఖీ బృందానికి అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గురువారం నుంచి సిబ్బంది గ్రామాలలో తనిఖీ చేపడతారన్నారు. ఉపాధి కూలీలు సిబ్బందికి సహకరించాలన్నారు. సామాజిక తనిఖీ సిబ్బందికి ఎస్ఆర్‌పి తిరుమలేష్ సిబ్బంది తనిఖీ పై అవగాహన కల్పించారు. అందుకు సంబంధించిన పత్రాలను సిబ్బందికి అందించారు. కార్యక్రమంలో ఎపిఒ పద్మారాణి, పిఆర్ ఎఇ ఈశ్వరయ్య, డిఆర్‌పిలు పాల్గొన్నారు.

ప్రోత్సాహకంతో ఉత్సాహం నింపవచ్చు

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

విద్యార్థులకు ప్రోత్సాహక పత్రాలు అందించడం వల్ల వారిలో చదువుతో పాటు మానసికంగా ఉత్సాహం నింపగలుగుతామని టికెఆర్ జీవన జ్యోతి హైస్కూల్ ఫౌండర్ గురుదేవ్ రామిరెడ్డి అన్నారు. బుధవారం స్థానిక పాఠశాలలో 'గ్రాడ్యుయేషన్ సెరిమోన్' అనే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గురుదేవ్ రామిరెడ్డి మాట్లాడుతూ పిల్లలు వారు సాధించిన విజయాలకు గుర్తుగా పొందే పత్రమే గ్రాడ్యుయేషన్ సర్టిఫికెట్ అన్నారు. క్రమశిక్షణ కల్గి ఉండడం వల్ల మంచి లక్షణాలు పొందవచ్చన్నారు. పాఠశాల కరస్పాండెంట్ అమర్ నాథ్ రెడ్డి, ప్రధానోపాధ్యాయులు డి. చిన్న గురు శేఖర్ ఉన్నత స్థాయివైపుగా విద్యార్థులను నడిపించడం మా పాఠశాల ప్రత్యేకతన్నారు. పిల్లలు సర్వతో ముఖాభివృద్ధి చెందేలా తీర్చిదిద్దే పద్ధతిలో గ్రాడ్యుయేషన్ సెరిమోని ఒకటన్నారు. కార్యక్రమంలో తల్లిదండ్రులు విద్యార్థులు పాల్గొని ఆనందాన్ని వ్యక్తం చేశారు.

సకాలంలో విధులకు హాజరయ్యేలా చర్యలు

ప్రజాశక్తి -ఖాజీపేట

గ్రామ సచివాలయ ఉద్యోగులు, సిబ్బంది సకాలంలో విధులకు హాజరయ్యేలా చర్యలు తీసుకోవాలని మాల మహానాడు రాష్ట్రఉపాధ్యక్షుడు గున్నంపాటి వెంకటరమణ పేర్కొన్నారు. బుధవారం మండల అధ్యక్షుడు కలిసి సచివాలయ ఉద్యోగులపై చర్యలు తీసుకోవాలని కోరుతూ వినతి పత్రం సమర్పించారు. స్థానికంగా ఉన్న సయ్యద్ నడిపి దస్తగిరి, సంధ్యారాణి ఉపాధి నిమిత్తం ఖాజీపేటలో నివసిస్తుండగా రేషన్ కార్డులో చిరునామా మార్పు కోసం సచివాలయానికి వెళ్తే సిబ్బంది పట్టించుకోకుండా నిర్లక్ష్యంగా సమాధానం ఇచ్చారని చెప్పారు. ఈ విషయం తమ దృష్టికి తీసుకొచ్చారన్నారు. ఆ మేరకు ఎంపిపి అబూబాకర్ సిద్ధిక్ దృష్టికి తీసుకెళ్లామనాన్రు. ప్రతి సచివాలయంలో ఉద్యోగుల తీరు విమర్శలకు తావిస్తుందని, ఉన్నతాధికారులు పట్టించుకోకపోవడం వల్లే ఈ పరిస్థితి నెలకొందన్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి సచివాలయ సిబ్బందిపై తగు చర్యలు తీసుకోవాలని కోరారు.

షూటింగ్ బాల్ పోటీలకు విద్యార్థులు ఎంపిక

ప్రజాశక్తి - వేంపల్లె

స్థానిక వైఎస్ఆర్ వివేకానంద ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులతో పాటు కళాశాలలో పని చేస్తున్న ఫిజికల్ డైరెక్టర్ రాష్ట్ర స్థాయిలో నిర్వహించే షూటింగ్ బాల్ పోటీలకు ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ చెరసాల యోగాంజనేయులు తెలిపారు. బుధవారం రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులను ప్రిన్సిపాల్ అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రస్థాయి సీనియర్ షూటింగ్ బాల్ పోటీలకు తమ కళాశాల నుంచి వర్ష, మురళి, మంజునాథ, సాయినాథ్‌తో పాటు ఫిజికల్ డైరెక్టర్ తేజేంద్ర ఎంపికైనట్లు చెప్పారు. కృష్ణాజిల్లా హనుమాన్ జంక్షన్‌లో ఈనెల 10 నుంచి 12 వరకు నిర్వహించబోయే రాష్ట్ర స్థాయి పోటీలకు హాజరు అవుతున్నట్లు తెలిపారు. తమ కళాశాల విద్యార్థులు రాష్ట్రస్థాయి పోటీలకు హాజరు కావడం సంతోషంగా ఉందన్నారు.

స్పర్శలేని మచ్చలుంటే వైద్యుడిని సంప్రదించాలి

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

శరీరంపై ఎలాంటి స్పర్శ లేని మచ్చలున్నా వెంటనే, ఆరోగ్య సిబ్బందికి తెలపాలని కామనూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ హనీఫ్ బాబా పేర్కొన్నారు. బుధవారం స్పర్శ కుష్టు వ్యాధి అవగాహన కార్యక్రమంలో భాగంగా ప్రొద్దుటూరు పొట్టిపాడు రోడ్డులో ఉన్న ప్రభుత్వ సాంఘిక సంక్షేమశాఖ బాలుర వసతిగృహం, ప్రభుత్వ సాంఘిక సంక్షేమశాఖ బాలుర కళాశాల విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి విద్యార్థీ స్వీయ పరీక్ష చేసుకుని ఏవైనా వెంటనే వైద్యుడిని సంప్రదించాలని సూచించారు. అనంతరం 98 మంది విద్యార్థులకు ఆరోగ్య పరీక్షలు చేపట్టారు. కార్యక్రమంలో హెల్త్ ఎడ్యుకేటర్ శోభరాణి, సూపర్ వైజర్ వరప్రసాద్, సాంఘిక సంక్షేమ అధికారులు నాగరాజు నాయక్, రామక్రిష్ణారెడ్డి, ఆరోగ్యకార్యకర్త చంద్రశేఖర్, సిహెచ్ఒ నాగలత, ఆశా కార్యకర్తలు పాల్గన్నారు.